# 22న సీఎం కేసీఆర్ రాక

■ పరిగిలో బహిరంగ సభకు ముమ్మర ఏర్పాట్లు ■ పరిశీలించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్, ఎంపీపీ అరవిందరావు

పరిగి, నవంబర్ 14 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 22న సాయంత్రం పరిగిలో జరిగే ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. సెంటిమెంట్ ప్రకారం ఈసారి సైతం పట్టణ శివారులోని జింఖాన గ్రౌండ్‌లోనే ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించాలని నిర్ణయించారు. పరిగి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి సూచనల మేరకు మంగళవారం గ్రౌండ్‌లో చదును చేసే పనులు ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎంపీపీ కరణం అరవిందరావు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కె.రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, సయ్యద్‌పల్లి సర్పంచ్ కె.వెంకటరాంకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు వేముల కిరణ్, వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు బి.రవికుమార్, తాహెర్‌అలీ, మొగులయ్యలు దగ్గరుండి బహిరంగ సభ ఏర్పాట్లు చేయించారు. సాధ్యమైనంత త్వరగా గ్రౌండ్ చదును చేయించడంతోపాటు అవసరమైన చోట మట్టి పోయించడం ద్వారా బహిరంగసభకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. సోమవారం కులకచర్లలో జరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రోడ్‌షో సక్సెస్ కావడంతో ఓవైపు ఉత్సాహంగా ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు సీఎం కేసీఆర్ సభకు రెట్టింపు జన సమీకరణతో సక్సెస్ చేసేందుకు ఇప్పటినుంచే గ్రామస్థాయి నుంచి కృషి చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో బహిరంగసభ స్థలం చదును చేయడంతో పాటు ఇతర ఏర్పాట్లు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈసారి కూడా సుల్తాన్‌పూర్ స్టేజీ సమీపంలోనే హెలిపాడ్ ఏర్పా టు చేయాలని నిర్ణయించారు. అలాగే సభకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ కోసం సైతం స్థలాలను పరిశీలించారు.



ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన తిమ్మాపూర్ నాయకులు

# గ్యారంటీ లేని కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దు

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

మర్పల్లి, నవంబర్ 14 : గ్యారంటీ లేని కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు.. మంగళవారం మర్పల్లి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహులు, నిఖిల్, అనంతయ్య, పాండుతో పాటు మరో 25 మంది నాయకులు ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనతోనే అన్ని గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి బారీ మెజారిటీతో ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపించుకుని మరింతగా అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు..

# పోలింగ్ విధులపై అవగాహన అవసరం

**జిల్లా ఎన్నికల అధికారి భారతి హోలీకేరీ**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 14 : ఎన్నికల ప్రక్రియలో అతి కీలకమైన పోలింగ్ విధులపై సంబంధిత అధికారులు, సిబ్బందికి అవగాహన అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ సూచించారు. మంగళవారం శ్రీఇందు ఇంజినీరింగ్ కళాశాలలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మాక్ పోలింగ్ నిర్వహించిన తర్వాత తప్పనిసరిగా డాటాను తీసివేయాలన్నారు. పోలింగ్ సజావుగా జరిగితే, కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా జరుగుతుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ఎంతో జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి అం శాన్ని నిశితంగా పరిశీలించి పర్యవేక్షించాలన్నారు.

**సీ విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి**

శాసనసభ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు సీ విజిల్‌యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భారతి హోలీకేరీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా.. బలవంత పెట్టినా.. ఈ యాప్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోలీకేరీ

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

**రాష్ట్ర ఎన్నికల జాయింట్ సీఈఓ సర్ఫరాజ్**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 14 : జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంయుక్త సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ ఎన్నికల అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణ అంశంలో భాగంగా మంగళవారం ఆయన కలెక్టర్లతో జూం మీటింగ్ నిర్వహించారు. వెబ్‌కాస్టింగ్, ఓటర్లకు స్లిప్పుల పంపిణీ తదితర వాటిపై ఆయన పలు సూచనలు చేశారు. వెబ్‌కాస్టింగ్ కోసం సరిపడా సిబ్బందిని నియమిస్తూ.. ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐ తదితర సంస్థలకు చెందిన విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హింసాత్మక, అత్యంత హింసాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు సరిపడా వసతులు కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ భారతి హోలీకేరీ, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# బృందావన్ డిస్టిలరీ సందర్శన



బృందావన్ డిస్టిలరీని పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు మునీశ్

వికారాబాద్, నవంబర్ 14 : జిల్లాలోని పూడూరు మండలం పరిధిలోని బృందావన్ డిస్టిలరీని మంగళవారం వికారాబాద్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఐఆర్ఎస్ మునీశ్, రంగారెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర సందర్శించారు. అక్కడ ఉన్న మద్యం నిల్వలు, ఇతర ప్రాంతాలకు తరలించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రంగారెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, వికారాబాద్ డీపీఈవో కర్ణాటక సరిహద్దులోని చెక్ పోస్టులను పరిశీలించారు. అక్రమంగా మద్యం తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామం పైన నిఘా ఉంచి ఎక్కడ మద్యం నిల్వలు ఉన్నా పట్టుకోవాలన్నారు. వారి వెంట వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘువీణ, ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

# డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 4వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 11వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

**ఈ నెల 20లోపు దరఖాస్తులకు ఆహ్వానం**

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): సేంద్రియ-ప్రకృతి వ్యవసాయంపై కేంద్రీయ వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) ఆధ్వర్యంలో 3 నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని అరికట్టడానికి ఈ పద్ధతి ఎంతో ఉపయోగపతుందని తెలిపారు. జీవన ఎరువులు, జీవ సంబంధిత పురుగు మందులు, మిత్ర పురుగులను ఉపయోగించే పద్ధతులపై వాటిని క్షేత్రస్థాయిలో తయారీ విధానాలపై హైదరాబాద్‌లోని సంస్థలో ఆచరణాత్మక సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హతలు ఇంటర్ పాస్ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసిన 18 ఏండ్లపైబడిన మహిళలు, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సులో 25 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుందని, గ్రామీణ యువతకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. డిసెంబర్ 6న ప్రారంభమయ్యే ఈ శిక్షణ వచ్చే ఏడాది మార్చి 13న ముగియనుంది. ఇందులో 21 రోజులపాటు రాజేంద్రనగర్‌లోని ఎన్ఐపీహెచ్ఎం ఆవరణలో పాఠాలు చెబుతారని, మిగతా 60 రోజులు పొలం పనుల్లో స్వయంగా సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగుచేయడం, వాటి విధానాలు నేర్పిస్తారు. చివరి 10 రోజులు సాగులోఎదురైన సమస్యలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో సంస్థలోనే ఉచిత వసతి కల్పిస్తారు. భోజన ఖర్చులు మాత్రం అభ్యర్థులే భరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫీజు రూ.7,500 చెల్లించి నవంబర్ 20లోపు అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 95426 38020లో డాక్టర్ కె.దామోదర చారిని లేదా dirphmniphm-ap లేదా asomicroniphm2019@gmail.com లో సంప్రదించాలని సూచించారు.

# ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) కోర్సుల సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.